అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 05 మార్చి 2023

క్రీడల్లో గెలుపోటములు సహజం

- గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్ రావు

నవతెలంగాణ-కెరమెరి

క్రీడల్లో గెలుపోటములు సహజమని గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వెంకటేశ్వర జాతర మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అథిగా హాజరయ్యారు. ఈ క్రీడల్లో సుల్తాన్ గూడజట్టు గెలుపొందింది. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి రూ.20116, ద్వితీయ బహుమతి అంబరావు గూడ జట్టుకు రూ.15116, తృతీయ బహుమతి జారుగూడ జట్టుకు రూ.5555 అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం, ఎంపీటీసీ ఇఫ్తేకార్ అహ్మద్, ఇనూస్, దేవ్‌రావ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్య ప్రోటోకాల్ వివాదం

- శిలాఫలకాన్ని తన్నిన కాంగ్రెస్ కౌన్సిలర్

నవతెలంగాణ-మంచిర్యాల టౌన్

అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రోటోకాల్ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం సాయంత్రం వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన లైటింగ్ శంకుస్థాపనకు ఎమ్మెల్యేతో పాటు చైర్మన్ కౌన్సిలర్లు హాజరయ్యారు. శిలాఫలకం వద్ద కొబ్బరికాయలు కొట్టేందుకు గతంలో ఓడిపోయిన టీఆర్ఎస్ అభ్యర్థికి ముందుగా అవకాశం ఇవ్వడంతో 24వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎమ్మెల్యే, చైర్మన్‌తో వాగ్వాదం చేస్తూ శిలాఫలకాన్ని తన్నడంతో కూలిపోయింది. టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సంజీవ్ పై దాడికి ప్రయత్నించగా పోలీసులు సంజీవ్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకెళ్లారు.

కబ్జాకు గురవుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డు



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డు రోజురోజుకు కబ్జాకు గురవుతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతిరోజు రోడ్డు ప్రక్కనే దుకాణాలు వెలుస్తున్నాయి. ఈ రోడ్డు గుండా విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఒక ప్రయివేటు పాఠశాల కూడా ఉండడంతో రోడ్డు బిజీబిజీగా ఉంటుంది. అదేవిధంగా రోడ్డు ప్రక్కన జెడ్పీ హైస్కూల్, ఫారెస్టు రేంజ్ కార్యాలయం ఉండడంతో ఇతర వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తూ చాలా రద్దీగా ఉంటుంది. నాలుగు వరుసల జాతీయ రహదారి వెడల్పులో భాగంగా పనులు జరుగుతుండడంతో సబ్‌స్టేషన్ ప్రక్కన టేలాలు ఏర్పాటు చేసి కబ్జాచేస్తున్నారు. జాతీయ రహదారి ప్రక్కనే ఉండడంతో వాహనదారులకు రోడ్డు కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఎలాంటి ప్రమాదాలు జరుగకుముందే, సంబంధిత అధికారులు రోడ్డు ప్రక్కన గల దుకాణాలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగుటున్నాయి. శనివారం సర్కిల్ ఆఫీస్ కార్యాలయం ఎదుత తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ విలాస్, కో-కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు 2022 మార్చ్ 31తో పీఆర్సీ గడువు ముగిసి 11 నెలలు గడిచినప్పటికి కొత్త పీఆర్సీ ప్రకటించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రకటించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రమేష్, మహేందర్, రామకృష్ణ, సాయి, ప్రవీణ్, కుమారస్వామి, కేదారి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని మహిళ మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొడసం సంధ్య(21) అనే మహిళ మృతిచెందింది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం శ్యాంరావు-సంధ్య భార్యభర్తలిద్దరు కలిసి ద్విచక్ర వాహనం(టీఎస్ 20 9528)పై వెళ్తుండగా భర్త శ్యాంరావు సెల్‌ఫోన్ జారి క్రింద పడిపోవడంతో సెల్‌ఫోన్ తీసుకోవడానికి ద్విచక్ర వాహనం ఆపి భార్య సంధ్య రోడ్డుపై పడివున్న ఫోన్ తీసుకొనే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి తండ్రి మెస్రం జంగు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

ఎంఎంసీ చైర్మన్‌ల ఆగడాలను అరికట్టాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంతర్‌రాష్ట్ర సరిహద్దుల వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఆదేశాలతో అధికారులు రైతుల నుండి పన్నుల పేరుతో చేపడుతున్న వసూళ్లను నిలిపివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటకు తెలంగాణలో గిట్టుబాటు ధర కల్పించని రాష్ట్ర ప్రభుత్వం, పక్కనున్న మహారాష్ట్రలో గిట్టుబాటు ధర ఉండడంతో రైతులు తమ పంటను అక్కడికి తరలిస్తుంటూ వారి నుండి పన్నుల పేరుతో ముడుపులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పత్తి వాహనాల నుండి రూ.ఐదు వేలకు పైగా వసూలు చేస్తున్నారని, ఇప్పటికైనా మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఆగడాలు మానుకోవాలని సూచించారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, జిల్లా ఉపాధ్యక్షులు ముత్తు అశోక్‌కుమార్, జిల్లా కార్యదర్శి సురేష్, భాస్కర్, సుచిత్, రవి, వికాస్ పాల్గొన్నారు.

ఇందాని గ్రామాన్ని సందర్శించిన డీఆర్‌డీఓ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇందాని గ్రామాన్ని డీఆర్‌డీఓ సురేందర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సంత ఆదర్శ గ్రామ యోజనపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారుచేస్తున్న వినాయక విగ్రహాలు, దుర్గామాత విగ్రహాలు, వివిధ రకాల విగ్రహాలు, మట్టి పాత్రలు, ఇంటిలో అలంకరించే వస్తువులను ఆయన పరిశీలించారు. ఇలాంటి విగ్రహాలు తయారుచేయడం ఎంతో సంతోషకరమని, విగ్రహాలు తయారు చేయడంతో గ్రూప్ సభ్యులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. ఇలాంటి విగ్రహాలు తయారుచేసి మార్కెట్‌లో అమ్మడానికి సిద్ధం చేయాలని ఆయన సభ్యులను కోరారు. కార్యక్రమంలో ఏపీఎం మహేష్, ఏపీఓ ఉస్మానియా పాల్గొన్నారు.

6న చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ పరిశ్రమలలో కార్మికుల కనీస వేతనాలు వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న చేపట్టనున్న చలో హైదరాబాదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కోరారు. చలో హైదరాబాదు కార్యక్రమ కరపత్రాలను శనివారం ఎస్పీఎం కాంట్రాక్ట్ కార్మికులకు పంపిణీ చేశారు. ముంజం ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను ఉపసరించుకోవాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు, అంతరాష్ట్ర వలస కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26,000 నిర్ణయించాలన్నారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు గత 15 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరించబడలేదని, ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న సుమారు కోటి మందికి పైగా ఉన్న కార్మికుల జీతభత్యాలు పెంచకపోవడం వల్ల కోట్లాది రూపాయలు నష్టపోయారన్నారు. కార్మికుల శ్రమను యజమానులు దోచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని, ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి పెరిగిన ధరలకు అనుగుణంగా చట్టబద్ధంగా ప్రభుత్వం వేతనాలు సవరించాలన్నారు. 2014లో కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా టీఆర్ఎస్ ప్రభుత్వం వేతనాలు సవరించకుండా అన్యాయం చేస్తోందన్నారు. ఈ నెల 6న చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేస్తుపడుతున్నామని, జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.తిమ్మరావు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, దీనికి నిరసనగా ఈ నెల 6వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేపట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా హామీలు మాత్రమే ఇస్తుందని, ఇప్పటివరకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, ఇతర కార్మిక సంఘాలకు సంబంధించిన పెండింగ్ బకాయిలను చెల్లించకుండా అనేక పని భారం మోపి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. దీనికి నిరసనగా హైదరాబాద్‌లో పెద్దఎత్తున నిరసన తెలపడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ కార్మిక సంఘాలకు సంబంధించిన వారందరు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఆస్పత్రులకు వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి కె.రామకృష్ణతో కలిసి సందర్శించి ఆస్పత్రిలోని పలు వార్డులు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, రోగులతో స్నేహభావంతో మెలగాలని అన్నారు. ఆస్పత్రిలో ప్రతి వార్డు ఉపయోగంలో ఉంచాలని, రోగులు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డైయిస్, రేడియాలజీ భవనాలలో సేవలను అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవం చేసుకునే విధంగా ప్రజలకు అవాహన కల్పించాలని, గర్భం దాల్చిన తరువాత సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తమ వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రసవం అనంతరం అందించే కేసీఆర్ కిట్లను గదులలో భద్రపరిచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయాలని తెలిపారు.



కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల పరిశీలన

జిల్లా కేంద్రంలో నిర్మాణమవుతున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకే చోట లభించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. వివిధ శాఖలకు కేటాయించిన కార్యాలయాల గదులలో విద్యుత్ సరఫరా, త్రాగునీటి ఏర్పాట్లను పూర్తి చేయాలని, వివిధ పనుల నిమత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు కూర్చునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటాలని, గార్డేనింగ్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వామి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి ధరమ్‌సింగ్, ఉప వైద్యాధికారి ఎండీ. రషీద్ పాల్గొన్నారు.

జైపూర్ ఎస్టీపీపీకి మరో రెండు అవార్డులు



నవతెలంగాణ-జైపూర్

అత్యుత్తమ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌తో జాతీయస్థాయిలో నెంబర్-1 ప్లాంట్‌గా ఇప్పటికే గుర్తింపు పొందిన సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ మరో రెండు ప్రతిష్టాత్మక అవార్డులను దక్కించుకుంది. కేంద్ర ఇరిగేషన్ ఇందన బోర్డు (పీటీబీపీ) వారు ఢిల్లీలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి సదస్సులో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ప్లాంట్ నిర్వాహణలో నీరు, బొగ్గు వినియోగం, కాలుష్య నివారణ చర్యల్లో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందున ఈ బెస్ట్ పెర్మార్మెన్స్ ప్లాంట్ అవార్డును అందజేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అదేవిధంగా ముంబాయికి చెందిన ప్రముఖ మిషన్ ఎనర్జీ సంస్థ శనివారం మధ్యాహ్నం గోవాలో నిర్వహించిన ఫ్లైయాష్ నిర్వాహణ జాతీయస్థాయిలో సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ బెస్ట్ ఫ్లైయాష్ యుటిలైజేషన్ ప్లాంట్‌గా గుర్తించి అవార్డును ప్రదానం చేసింది. మహాజెన్‌కో ఈడీ (ఎన్విరాన్‌మెంట్ అండ్ సేఫ్టీ) డాక్టర్ నితిన్‌వాగ్ నుండి ఎస్టీపీపీ తరపున ఏజీఎం శ్రీనివాసులు. ఎస్ఈ కే కిరిటీ, ఈఈ రమేశ్‌లు ఈ అవార్డులు అందుకున్నారు.

హర్షం వ్యక్తం చేసిన సింగరేణి సీఎండీ శ్రీధర్

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి జాతీయ స్థాయిలో మరో రెండు పురస్కారాలు లభించడం పట్ల సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్లాంట్ ఉద్యోగులు, అధికారులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఇదే ఒరవడితో ముందుకు సాగాలని, రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చాలని కోరారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేష్ అన్నారు. మండలంలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ఆన్ లైన్ విధానంలో కోర్టు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా కోర్టులో తమ తరపున లాయర్‌లను పెట్టుకోలేని పరిస్థితిలో ఉంటే వారికి ఉచిత న్యాయ సహకారం లభిస్తుందని దీనిని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు మంచి బుద్దులు నేర్పే బాధ్యత ఉపాధ్యాయులపై తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. అనవసరంగా విద్యార్థులను దండిస్తే చట్టం ప్రకారం శిక్ష ఉంటుందని తెలిపారు. దండనతో కూడిన విద్య సరైనది కాదని ప్రేమతో విద్యార్థులను దగ్గర చేర్చుకోవాలని అన్నారు. విద్యార్థులు వరకట్న నిషేధ చట్టం, ర్యాగింగ్ నిరోధక చట్టం, ఆహార భద్రత చట్టం, వ్యక్తిగత రక్షణ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో విద్యార్థులు నడుచుకునే విధానాన్ని ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా చట్టాలపై అవగాహన పెంచుకుని ఆ దిశగా విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, కార్యదర్శి నరహరి, ఏజీపి దీపక్ రావు, న్యాయవాదులు రాజీవ్ రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మున్సిపల్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన

మంచిర్యాల టౌన్ : మున్సిపల్‌లో సుందరీకరణ పనులకు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శంకుస్థాపన చేశారు. ప్రధాన కూడళ్లైన హనుమాన్ సర్కిల్, వెంకటేశ్వరా టాకీస్ చౌరాస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మి టాకీస్ చౌరస్తా, ఏసీసీ చౌరోస్తా వరకూ రూ.3.60 కోట్లతో, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముకేశ్ గౌడ్ పాల్గొన్నారు.

నాతేయ మహఫిల్ సభ పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్ : ఈనెల 5వ తేదీన ఏపీజే అబ్దుల్ కలాం చౌక్(బజార్ వాడి) వద్ద నాతేయా మెహఫిల్ సభకు సంబంధించిన పోస్టర్లు శనివారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వచ్చే రంజాన్ మాసం సందర్భంగా నాతేయా మహి ఫీల్ సాయంత్రం 6 గంటలకు సభ ప్రారంభించడం జరుగుతుందని ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, అబ్దుల్ రహమాన్, అహ్మద్ బీన్ అబ్దుల్లా, ఎండీ అహ్మద్, సల్మాన్ ఖాన్, కషిఫ్ హష్మీ, నజీర్, ఖైఫ్, రహమాన్, అమన్, అద్నాన్ పాల్గొన్నారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అటవీ హక్కుల రక్షణ కోసం ఆదివారం కాగజ్‌నగర్‌లో ప్రజాసంఘాలు, రైతు సంఘాలు నిర్వహించే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్‌హుస్సేన్, ఆదివాసీ సంఘాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ సోయం చిన్నయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎండి చాంద్‌పాషా కోరారు. శనివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లోని భూగర్భ వనరులను కార్పోరేట్లకు దోచి పెట్టేందుకే ఆదివాసీలను అడవుల నుండి గెంటివేసే విధానాలకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అటవీ హక్కులను నిర్వీర్యం చేసే అటవీ సంరక్షణ నియమాలు-2022ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో టైగర్ కారిడార్ పేరుతో ఐదు తునికాకు కళ్లాలలో ఆకు సేకరణను నిలిపివేస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆకు సేకరణపై ఆధారపడి జీవిస్తున్న కూలీలకు ఇది నష్టం చేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామ్రె గౌతం, రాంప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.

వేసవిలో మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



నవతెలంగాణ-భీమారం

వేసవి కాలంలో మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ వనసేవక్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని పోలంపల్లి గ్రామ పంచాయితీలో గల జీపీ నర్సరిని సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంపొందిస్తున్న మొక్కలను పరిశీలించి, వేసవి తాపానికి మొక్కలపై దృష్టి కేంద్రాకరించాలని అన్నారు. ప్రతీ మొక్కను పూర్తిగా తడిసేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టి నీరందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దర్శనాల రమేస్, ఎంపీఓ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ పట్టణంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వద్ద సీసీ రోడ్డు, బజార్ వాడిలో స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండడంతో ప్రమాదాలు జర్గుతున్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు కోరారు. శనివారం గ్రామపంచాయతీ ఈఓ నాంపల్లి వంశీకృష్ణకు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వద్ద సిసి రోడ్డు, బజార్‌వాడిలో బ్రేకర్లు ఎత్తుగా ఉండడంతో రాత్రి సమయంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వెంటనే పరిశీలించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటానని ఈ ఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు షబ్బీర్, బీఆర్ఎస్ నాయకుడు ఎండి అహ్మద్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చేయూత

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మందమర్రి ఎమ్మెల్యే కాలనీలో నివసిస్తున్న రజన్న అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నాడని స్థానికులు జిఎస్ఆర్ ఫౌండేషన్ డాక్టర్ రాజా రమేష్‌కు సమాచారం ఇవ్వటంతో శనివారం బాదితున్ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని 25కేజీల బియ్యం, కొంత ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం డాక్టర్ రాజ రమేష్‌బాబు మాట్లాడుతూ రాజన్న గుండె, కిడ్నీ, కాలేయం పనితీరు తగ్గిందని వెంటనే మెరుగైన వైద్యానికి తీసుకెళ్లటానికి అంబులెన్స్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ పాషా, బద్రి సతీష్, ఉపలపు సురేష్, ప్రకాష్, అశోక్, హరీష్, రాజు, గోపాల్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని మాదారం టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింద బాస్కెట్, త్రోబాల్, మ్యూజికల్ చేర్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ నెల 8వ తేదీన గోలేటిలో నిర్వహించనున్న మహిళా దినోత్సవం వేడుకల్లో బహుమతులను ప్రధానం చేయనున్నారు. కార్యక్రమంలో సింగరేణి హైస్కూల్ పీఈటీ ఉపాధ్యాయుడు భాస్కర్, సేవా సమితి సభ్యులు జాన్సీ, సౌజన్య పాల్గొన్నారు.

హోలీ పండుగ 7న జరుపుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 6న సోమవారం రాత్రి కామదహనం నిర్వహించుకొని, 7న మంగళవారం హోలీ పండుగను జరుపుకోవాలని హిందూ ఉత్సవ సమితి కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందూ పండుగల్లో హోలీ పండుగకు ఎంతో విశిష్టత ఉందని, హోలీ పండుగ సందర్భంగా రసాయన రంగులు వాడకుండా సహజ సిద్ధమైన రంగులతోనే పండుగ ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు.

ఆదివాసీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-సిరికొండ

ఆదివాసీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోథ్ సివిల్ జడ్జీ హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని రిమ్మ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మారుమూల గ్రామాలకు సైతం చట్టాల గురించి అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అటవీ హక్కు, పీసా, 1/70 చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. చట్టాలకు లోబడి ఉండాలని కోరారు. కేసులు ఏవైనా పెండింగ్‌లో ఉంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందూర్ అమృత్ రావు, సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్, శంకర్ పటేల్, తొడసం అమృత్ రావు, న్యాయవాదులు పంద్రం శంకర్, దమ్మపాల్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్
2
ఆదివారం 05 మార్చి 2023

యువత క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-సారంగాపూర్

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నాగపూర్ గ్రామ క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యమానికి హాజరై టోర్నీలో గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు.అనంతరం మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరకధారుఢ్యం, స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని అన్నారు. ఈ టోర్నీలో 60 జట్లు పాల్గొన్నాయి. నర్సాపూర్ మండల కేంద్రానికి చెందిన జట్టు మొదటి బహుమతి, సారంగాపూర్ మండలం నాగపూర్ జట్టు రెండో బహుమతి, నేరడిగొండ మండలం బుగ్గారం జట్టు మూడో బహుమతి గెలుచుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్ రెడ్డి, నర్సాపూర్ ఎంపీపీ రమేష్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్ రావు, స్థానిక సర్పంచ్ జాదవ్ సురేష్, అయగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

దూరప్రాంతాలకు వెళ్లకుండ స్టడీ సర్కిల్ ఏర్పాటు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత విద్యార్థులు పోటీ పరీక్షల శిక్షణకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కృషితో స్థానికంగానే స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంఎం డిఫెన్స్ అకాడమీలో ఎస్సీ స్టడీ సర్కిల్‌ను శనివారం సందర్శించారు. శిక్షణ తరగతుల నిర్వహణ గురించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోటీ పరీక్షల కొరకు విద్యార్థులకు అందుబాటులో జిల్లా కేంద్రంలో ఎస్సీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసుకొని, కట్టుదిట్టమైన ప్రణాళికతో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. మంత్రి చొరవతో శాశ్వతంగా స్టడీ సర్కిల్ నిర్వహించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ రాజేశ్వర్‌గౌడ్, ఏఎస్‌డబ్ల్యూఓ లత, అకాడమీ డైరెక్టర్ ఏ.రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-నిర్మల్



బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మల్లేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండలంలోని జయరాం తండాకు చెందిన ఆత్రం జంగుబాయి(8) సంవత్సరాల బాలిక, తన తల్లి ఆత్రం అనితాబాయతో బుధవారం మధ్యాహ్నం నిర్మల్ బస్టాండుకు వచ్చింది. తన తల్లి పండ్లు కొంటున్న సమయంలో బస్టాండ్ సమీపంలో తప్పిపోయింది. ఆ తర్వాత తన తల్లి వెతికిన ఆ పాప కనిపించలేదు. ఈ మేరేకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బాలిక కనిపించినవారు పోలీస్ స్టేషన్‌లో ఫోన్ నెంబర్ 8712659511 కు సమాచారం తెలియజేయలని కోరారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



నవతెలంగాణ-తాంసి

సైన్స్‌డే సందర్భంగా శనివారం మండలంలోని కప్పర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బండల్‌నాగపూర్, నిపాని పాఠశాలల విద్యార్థులు ఎర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యఅతిథులుగా డీఎస్పీ ఉమేందర్ హాజరయ్యారు. విద్యార్థులు పోలీస్, ఆర్మీ దుస్తులు ధరించి గౌరవ వందనంతో స్వాగతం పలికారు. మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి స్టాళ్లను ప్రారంభించారు. దాదాపు విద్యార్థులు 80 స్టాళ్లను ప్రదర్శించారు. రోడ్డు భద్రత, కాలేయం, గుండె పని విధానం గురించి విద్యార్థులు వివరించారు. మూడ నమ్మకాలు నమ్మవద్దని వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఇంత మంది విద్యార్థులు చదువుకోవడం సంతోష దగ్గ విషయమని అన్నారు. ఇంత మంచి ప్రదర్శన ఇంత వరకు చూడలేదని అన్నారు. చదువుతో పాటు ఇలాంటి నైపుణ్యం కలిగి ఉండాలని అన్నారు. చదువు పైనే ధ్యాస ఉండాలని అపుడే చదువులో రాణించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సదానందం, ఎంపీటీసీ సంతోష్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, సెక్టోరల్ అధికారి నర్సయ్య వీరేందర్, పాఠశాల సిబ్బంది. కిష్టన్న, అశోక్, సంతోష్ ఉన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-బేల

యువకులను క్రీడల్లో ప్రోత్సహించాలనే సదుద్దేశంతో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో టాక్లీ గ్రామానికి చెందిన యువకులకు శనివారం క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి నివాసంలో ఈ కిట్లను యువకులకు అందజేశారు. అనంతరం ఆయన యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ యువకులకు క్రీడలు ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయని అన్నారు. అదేవిధంగా క్రీడాకారులకు తన వంతుగా ఏదైనా సహాయ సహకార అందించాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. రాబోయే రోజుల్లోనూ గ్రామ క్రీడాకారులకు యూత్ కాంగ్రెస్ తరపున యూత్ కాంగ్రెస్ నాయకునిగా తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అయితే క్రీడాకారులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చదువులో రాణిస్తూ, ఉన్నత లక్ష్యాన్ని సాధించడంతోపాటు క్రీడలపై దృష్టి సారించి ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంజీవ్ గుండావార్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మడావి చంద్రకాంత్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాకేష్, గణేష్, మేకల జితేందర్, సునీల్, గ్రామ యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని బంగాల్‌పేట్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను కలెక్టర్ వరుణ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చెత్త నుండి సంపద, తడి, పొడి చెత్త ద్వారా వర్మీకంపోస్ట్ వంటి వాటిని పరిశీలించి, రిసైకిలింగ్ చేయాలని, వాచ్‌మెన్ క్వార్టర్స్, వేయింగ్ బ్రిడ్జి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రై రిసోర్స్ సెంటర్‌కు సంబంధించి కొన్ని మార్పులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ చందర్, డీఈ నాగేశ్వర్‌రావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కాంట్రాక్టర్ ఫారుఖ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యులకు సీపీఆర్ శిక్షణా తరగతులు నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు సీపీఆర్ శిక్షణా తరగతులను నిర్వహించాలని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భీముడు, ఎస్.నర్సిములు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ, గ్రామీణ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు వివిధ మారుమూల గ్రామాల్లో ప్రథమ చికిత్సలు అందిస్తున్నారని అన్నారు. సీపీఆర్ కూడా ప్రథమ చికిత్సలో భాగంగా భావించి, తమకు సీపీఆర్ శిక్షణ తరగతులను వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

నవతెలంగాణ-నిర్మల్

విద్యార్థులు కష్టపడి చదవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బీసీ సంక్షేమ వసతి గృహంలో చదువుకుంటున్న పది విద్యార్థులకు మోటివేషన్ తరగతులను, పరీక్షలకు ఎలా సిద్ధం అవ్వాలనే విషయంపై చాణక్య కాలేజీ ఆవరణలో అవగాహన తరగతులు శనివారం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పిల్లలకు పదో తరగతి మార్కులు ఎంత ముఖ్యమో వివరించారు. ఏకాగ్రతతో, కష్టపడి శ్రమిస్తేనే ఏదైనా సాధించగలమని అన్నారు. ఎలాంటి పరిస్థితులలోనూ ఆత్మస్థైర్యాన్ని విడనాడవద్దని సూచించారు. తల్లిదండ్రుల కష్టాలన్నీ బాగా చదవడం వల్ల దూరం చేయవచ్చని తెలియజేశారు. విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. విషయ నిపుణులు అయిన ఉపాధ్యాయులను పిల్లలు పరీక్షలలో విజయం సాధించే విధంగా బోధించాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి లోకేష్,



డీఈఓ రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమశాఖ అధికారులు గంగాధర్, ఖాలిక్, హాస్టల్ వార్డెన్ లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-తాంసి

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో ప్రాథమిక సహకార సొసైటీ ఆధ్వర్యంలో శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచి అరుగాలం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మండలాల వారిగా పంటలు కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు కండ్లలో ఆనందం ఉన్నంత వరకు బీఆర్ఎస్ అధికారంలో ఉంటుందని అన్నారు. దళారీలను నమ్మి మోసపోవద్దని అన్నారు. రైతుకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజు, సీఈఓ కేశవ్, రాంరెడ్డి, నాయకులు రాజు, మహేందర్, గోవర్ధన్ రెడ్డి, రాంచందర్ రెడ్డి, ధనుంజయ్, రఘు, లస్మన్న ఉన్నారు.

'భూకబ్జాదారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

నవతెలంగాణ-నిర్మల్

దళిత రైతు భూమి కబ్జా చేసిన సర్పంచ్, వీడీసీ వాళ్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాకూరి తిరుపతి, దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల ఐక్య వేదిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ దళిత రైతు కొబ్బనోళ్ల గంగన్నకు 5 ఎకరాల పట్టా భూమి ఉందన్నారు. ఈ భూమి మాదని అబ్దుల్లాపూర్ సర్పంచ్, గ్రామ వీడీసీ సభ్యులు కలిసి ఆ రైతును భూమి నుంచి వెళ్లగొట్టి



చంపేస్తామని బెదిరించారని అన్నారు. భూమిని కబ్జా చేసి వారి స్వాధీనంలోకి తీసుకున్నారని తెలిపారు. ఈ భూమిని తిరిగి దళిత రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ భూమిపై కబ్జాదారులుగా ఉన్న సర్పంచ్, వీడీసీ గ్రామ నాయకులుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యాయం కోసం ఈ నెల 6న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ రామలక్ష్మణ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దొర రామగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్, బాధితుడు కొబ్బనోళ్ళ గంగన్న పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట



నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి తెలంగాణ దేవాదాయ శాఖ రూ.24 లక్షలు మంజూరు చేయటంతో ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శనివారం ఉదయం భూమిపూజ చేశారు. ఆనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముధోల్ నియోజకవర్గంలో అనేక ఆలయ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. ఆలయ నిర్మాణానికి స్థలం ఇచ్చిన గ్రామ యువకులు శ్రీనివాస్, బొజేంధర్‌లను అభినందించారు. అనంతరం యువకులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్య రవీంధర్‌రెడ్డి, సీపీసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్ రెడ్డి, ఎంపీటీసీ బండారి గంగాధర్, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కన్నోల్ల రవికుమార్, సర్పంచ్ సాయినాథ్, నాయకులు మరిబా, నర్సారెడ్డి, ముత్యం, రాజన్న, బొజెంధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ సంఘం గ్రామ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కుచులాపూర్, గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం గ్రామ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుచులాపూర్ బీసీ సంఘం గ్రామ అధ్యక్షులు ఏడుమేకల వెంకన్న యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ పోచ్చన్న, ప్రచార కార్యదర్శిగా రాము, కోశాధికారిగా గణేష్ సింగ్‌లను ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. అందరి సహకారంతో నూతన కార్యవర్గ నాయకులు బీసీల అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా చర్లపల్లి, ఝరి గ్రామాల బీసీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల నాయకులు మేకల రవికాంత్ యాదవ్, అసం రవీందర్, వెంకన్న, మేకల సదాశివ్, జక్కుల మహేందర్, వామన్, గీసా మల్లయ్య, సల్ల దేవన్న, రణవీర్, బుయ్యని గంగారెడ్డి, ఓంప్రకాష్, భువనగిరి స్వామి పాల్గొన్నారు.

నేడు జిల్లా బట్రాజు సంఘం ఎన్నికలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

నేడు ఆదివారం జిల్లా బట్రాజు సంఘం ఎన్నికలను స్థానిక యాదవ సంఘ భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బిరుదు భగవాన్ రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరై తగిన సూచనలు చేసి, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశానికి బట్రాజు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఎన్నికల అధికారిగా చిన్న మాధవుని శ్రీరామరాజు, పరిశీలకులుగా సీవీ జీవన్ రాజు వ్యవహరిస్తారని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ అన్ని రంగాల్లో ఉత్తమంగా రాణించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత సూచించారు. పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా న్యాయమూర్తులు, వివిధ శాఖల మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత మాట్లాడుతూ మహిళల రక్షణకు అందుబాటులో ఉన్న చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహనా కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో తమదైన గుర్తింపు సాధిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్త్రీ, పురుషులిద్దరూ బాధ్యతగా వ్యవహరిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి ఉంటె సమస్యలు తలెత్తే ఆస్కారం ఉండదని పేర్కొన్నారు. చిన్నపాటి విషయాలను తేలిగ్గా తీసుకుంటేనే సమస్యలు ఉండవని వివరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మాధవి కృష్ణ, మంజుల డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్రాల నగేష్, ఆర్టీసీ డీపో మేనేజర్ కల్పన, సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-గుడిహత్నూర్

మండల కేంద్రానికి చెందిన సీనియర్ విలేకరి నాగుల సతీష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగా, రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి శనివారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఆడే శీలా, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు బుర్ల లక్ష్మీనారాయణ, మచ్చాపూర్ మాజీ సర్పంచ్ రాథోడ్ ప్రతాప్ ఉన్నారు.

నొప్పి భరించలేక వృద్ధుని ఆత్మహత్య

నవతెలంగాణ-లోకేశ్వరం



నొప్పిని భరించలేక మనస్థాపంతో వృద్దుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుర గ్రామానికి చెందిన అడ్డిగ సాయన్న(70) గత సంవత్సరం నుండి కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా వ్యాధి నయం కాలేదు. గత రెండు, మూడు రోజుల నుండి నొప్పి తీవ్రత పెరగడంతో భరించలేక, మనస్థాపం చెంది శనివారం ఉదయం తన సొంత పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు సాయన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు పాఠాలు బోధించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బాసర

మండలంలోని కౌట గ్రామంలో శనివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పర్యటించారు. కౌట గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. మన ఊరు మనబడి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసి సకాలంలో అందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుశీల బాబురావు పటేల్, బాసర సర్పంచ్ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు గోవిందరాజులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి



నవతెలంగాణ-నార్నూర్

అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎంపీటీసీలతో 2023కు సంబంధించిన బీపీడీపీ మండల ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలు చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీటీసీలు అబేదాఖానం, కళావతి ఉత్తం, కే పరమేశ్వర్, రేణుక, ఎపీఎం రమేష్, ఎంఈఓ ఆశన్న, ఏఈ సుభాని, ఏపీఓ సురేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ స్కూల్లో ఘనంగా వార్షికోత్సవం

నవతెలంగాణ-కడెం



మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్‌రావు హాజరై మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న నిగూఢమైన శక్తులను వెలికి తీయడానికి వారికి సామాజికంగా సమాజంతో మమేకం కావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. అదే విధంగా ఏసీ ఏమో శివాజీ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఈ పాఠశాలను అప్‌గ్రేడేషన్ చేయాలని అందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి శివాజీ, హెడ్ మాస్టర్ బలరాం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజేష్ నాయక్, వార్డెన్ రాంజీ, వివిధ పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు, బంజారా సంఘం జిల్లా నాయకులు అపావత్ రాజేందర్, పీడీ రమేష్ వార్డెన్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాదించాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈఓ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వడ్యాల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమైన విషయాలు, పదో తరగతి విద్యార్థుల మొదటి ప్రీ ఫైనల్ విషయులు రివ్యూ చేశారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అభ్యసదీపికల సమీక్ష గురించి క్లుప్తంగా విద్యార్థులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈఓ విద్యార్థులను సామర్థ్యాలను పరిక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యుద్ఘాతంతో రైతు మృతి

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చించాల గ్రామంలో శనివారం ఉదయం పంట పొలంలో ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై రైతు మృతి చెందాడు. కుటుంబీకులు, ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం... చించాల గ్రామానికి చెందిన గట్టుపల్లి రామకృష్ణ(40) రైతు తన మొక్కజొన్న పంటకు అడవి జంతువుల బారి నుండి రక్షించేందుకు శుక్రవారం రాత్రి జీవైరు చుట్టి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. శనివారం ఉదయం పంట చుట్టూ అడవి జంతువుల కోసం పెట్టిన విద్యుత్ కనెక్షను తీసే క్రమంలో ప్రమాదవశాత్తు తాను అమర్చిన తీగలపై జారిపడ్డాడు. దీంతో అక్కడి కక్కడే మరణించాడు. కుటుంబీకులు మృతుని ఫోనుకు పలుమార్లు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకపోవడంతో వెంటనే పంట చేనుకు వెళ్లి చూసేసరికి రామకృష్ణ విగతజీవిగా పడి ఉన్నాడు. ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కుమార్తె, కొడుకు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ముధోల్ ఎస్సై తిరుపతి పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడు గ్రామంలోని అందరితో కలుగోలుపుగా ఉంటూ ఆప్యాయతగా పలకరించే వాడని ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛ్చాయలు అలుముకున్నాయి.

బొగ్గు ఉత్పత్తికి కావాల్సిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

ఓబీ ఎంత ఎక్కువ తీస్తే అంత ఎక్కువ బొగ్గు ఉత్పత్తి అవుతుందని, దానికి తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్ ఫైనాన్స్ పా బలరాం సూచించారు. శనివారం ఓబీ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ఓబి తీస్తున్న సుశీ హైటెక్, గౌరవ్, చల్లా రఘుపతి రెడ్డి, ఇందారం ఉపరితల గనిలో దుర్గ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారిని ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలుగకుండా, అలాగే అత్యంత రక్షణతో పని చేయాలని కోరారు. ఉపరితల గనిలో యంత్రాల సామర్థ్యం పెంపుదల కొరకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్లను కోరారు. కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తం రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని సర్వే ఆఫీసర్ సంపత్, ఐటి సీనియర్ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నైతిక విద్య పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన నైతికత మానవ విలువలు పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్ పలు కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రభుత్వరంగ, ప్రైవేటు మొత్తం 47 కళాశాలల్లో ఈ పరీక్ష జరిగిందని, కళాశాల ప్రిన్సిపాళ్లు ముందస్తుగా ప్రశ్నాపత్రాలను డౌన్ లోడ్ చేసుకొని పరీక్ష నిర్వహించారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం జనరల్ 4474 మందికి 4175 మంది హాజరయ్యారని, 299 మంది గైర్హాజరయ్యారని, ఒకేషనల్ విభాగంలో 783 మందికి 671 మంది హాజరయ్యారని, 112 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఈ పరీక్షల పర్యవేక్షణలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నైతం శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. అధికార పార్టీ అండదండలు, బీఆర్‌ఎస్ అనుచరులకే ఈ ఇండ్లు కేటాయించారని ఆరోపించారు. పెళ్లి చేసుకొని ఒకే ఇంట్లో జీవనం సాగిస్తున్న అన్నాదమ్ముళ్ల కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, వీరి పేర్లు అర్హుల లిస్టులో లేకపోవడం బాధాకరమని అన్నారు. అధికారులు స్పందించి లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

విద్యార్థులకు రాయడం, చదవడం రావాలి



నవతెలంగాణ- కౌటాల

విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని మండల నోడల్ అధికారి గావుడె హన్మంతు అన్నారు. శనివారం మండలంలోని తాటినగర్, మొగడ్‌దగడ్ పాఠశాలలను పరిశీలించి విద్యార్థులచే రాయించడం, చదివించడం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రాయడం, చదవడం వచ్చేలా కృషి చేయాలని వారికి సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవర్చాలని సూచించారు. ఆయన వెంట సీఆర్‌పీ రవి ఉన్నారు.

ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం



నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని శనివారం ఆ పార్టీ ఆసిఫాబాద్ కోఆర్డినేటర్ పెరుగు ఆత్మారాం ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ పార్లమెంటు అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్ హాజరై ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం చేసిన అభివృద్ధి, ఎన్‌టీఆర్ చేసిన సేవలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజా సమస్యలను తెలుకుంటూ, టీడీపీ కరపత్రాలను అందిస్తూ తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దుర్గం విజయ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆదిలాబాద్ పార్లమెంటు అధ్యక్షుడు పోల్కార్ సాయిరాం, ఎంపీటీసీ అభ్యర్థులు కొత్వాల్ శ్రీనివాస్, పోచం, నాయకులు సంతోష్, రవీందర్, రవి పాల్గొన్నారు.

బాధ్యతలను స్వీకరించిన సీఐకి సన్మానం



నవతెలంగాణ-కౌటాల

కౌటాల సీఐగా బాధ్యతలు స్వీకరించిన సాదిక్‌పాషాను ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్‌ను పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు బండి శ్రీనివాస్, మధూకర్, భిట్టుపెల్లి సంతోష్, డబ్బ బాపు, బసార్కర్ అశోక్, రాంచందర్, రమేష్ ఉన్నారు.

అర్హులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



అర్హులైన పేద ప్రజలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మహంకాళి శ్రీనివాస్ మాట్లాడుతూ దళిత బంధు ధోరణిలాగానే, సొంత పార్టీ వారికే డబల్ బెడ్‌రూమ్ లబ్దిదారుల ఎంపిక సాగుతోందని విమర్శించారు. కొద్ది రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయంలో వేసిన జాబితాలో అధికార పార్టీ అధ్యక్షుడు వారి స్కూల్ హెడ్మాస్టర్, ఇతర సిబ్బందికి డబల్ బెడ్ రూమ్ అర్హులుగా కేటాయించడం జరిగిందని అదేవిధంగా డబల్ బెడ్రూంలో అర్హుల సర్వే రెవెన్యూ అధికారులు ఇటీవల చేపట్టినప్పుడు స్థానిక కౌన్సిలర్లు వారితో కలిసి వారికి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే డబ్బులు తీసుకొని అర్హులుగా రాపిచ్చినట్లు కనిపిస్తోందని అన్నారు. పేద ప్రజలకు డబల్ బెడ్ రూమ్ ల ఆశ చూపించి, ఈ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే, వారి సొంత పార్టీ వారికే డబల్ బెడ్‌రూమ్ పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం అవుతుందని ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే పేద ప్రజలకు ఇచ్చినటువంటి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వేల్పుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జంగపెల్లి మల్లయ్య, వైద్య శ్రీనివాస్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు, మేదరి లక్ష్మి, ఓబీసీ జిల్లా నాయకులు ముద్దసాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు వేముల అశోక్ పాల్గొన్నారు.

కన్వినెన్స్ డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



నవతెలంగాణ-రెబ్బెన

కన్వినెన్స్ డ్రైవర్ అక్తర్ హుస్సేన్‌ను అకారణంగా విధుల నుండి తొలగించి మానసిక వేధింపులకు గురిచేస్తున్న క్వాలిటి జీఎం అల్లి రాజేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం సింగరేణి బెల్లంపల్లి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) కార్యదర్శి ఎ.ఓదెలు డిమాండ్ చేశారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో గత ఐదేండ్ల నుండి క్వాలిటి జీఎం వద్ద పనిచేస్తున్నాడని తెలిపారు. డ్రైవర్ అక్తర్ హుస్సేన్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గత వారం రోజుల నుండి ఆందోళన చేస్తున్న కన్వినెన్స్ డ్రైవర్లకు మద్దతుగా శనివారం కైరిగూడ ఓసీ కన్వినెన్స్ డ్రైవర్లు మద్దతు తెలిపారు. సందర్భంగా ఎ ఓదెలు మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఆఫీసర్స్ ఇంటి పనులకు వాడుకోవడం చట్ట విరుద్ధమని, ఆఫీసర్ల భార్యలు చెప్పే పనులు కూడా వినాలని మాట్లాడడం విడ్డూరమన్నారు. ఇంతకి కన్వినెన్స్ డ్రైవర్ అక్తర్ హుస్సేన్ చేసిన నేరం ఏమిటని, ఆఫీసర్ వేకిల్ వద్దకు వచ్చినప్పుడు నమస్తే పెట్టి వెంటనే డోరు తెరవలేదనే అక్కసుతో విధుల నుండి తొలగించడం అన్యాయమన్నారు. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి, డ్రైవర్లు ఎస్ రాము, వెంకటేశ్, ఎం.మల్లేష్, రఘు, శ్రీకాంత్, శ్రీనివాస్, అవినాష్, రాజేందర్ పాల్గొన్నారు.

తపాలాపూర్ చెరువు శిఖం భూమి కబ్జా



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాల్‌పూర్ గ్రామంలో సీలింగ్ భూములు కబ్జాకు గురయ్యాయి. గత నాలుగేళ్ల క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తపాల్‌పూర్‌లో ఓ ప్రజాప్రతినిది కుమారుడు రెండు ఎకరాల ఇరవై గుంటల భూమి సర్వే నెం. (147/11)లో పట్టా చేయించుకున్నారు. అదే గ్రామానికి చెందిన మరో, నాయకుడు 5 ఎకరాలు సీలింగ్ భూమిని పట్టా చేయించుకున్నారు. ఈ భూమి(సర్వే నెం. 147/76)లో ఉంది. ఇరువురు పట్టాదారులు తెలంగాణ గ్రామీణ బ్యాంకు, తపాలపుర్ శాఖ నుంచి రుణం తీసు కున్నారు. వీరితో పాటు మరికొంత మంది కలిసి మొత్తం 23 ఎకరాల సీలింగ్ భూమి అన్యాక్రాంతం చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం జన్నారంలో తహసీల్దార్‌గా పనిచేసిన వీరందరికీ అప్పనంగా ఆ భూములను అప్పజెప్పి పట్టాలు చేసినట్లు తెలుస్తోంది. ఇవే కాకుండా మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, సీలింగ్ భూములను పట్టా చేసినట్లుగా సమాచారం. తపాల్పూర్ గ్రామంలో ఇద్దరు ప్రజా ప్రతినిధులు ఏడున్నర ఎకరాల భూమిని కబ్జా చేసుకోవడంపై పలువురు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జన్నారం డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహనన్‌ను వివరణ కోరగా ఆది మేము పని చేస్తున్న సమయంలో పట్టా కాలేదని, గతంలో ఎప్పుడూ ఏ తహసీల్దార్ పని చేసిన కాలంలో జరిగిందో తనకు తెలియదని సమాధానం ఇచ్చారు. వెంటనే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ముగిసిన విద్యార్థుల క్షేత్ర పర్యటన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జాతీయ హరితదళం, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రకృతికి వెళుదాం' విద్యార్థుల రెండు రోజుల క్షేత్ర పర్యటన శనివారంతో ముగిసింది. జిల్లాలో ఎంపిక చేసిన 50 మంది విద్యార్థులచే కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. సిర్పూరు(టి) మండలంలోని వేంపల్లిలో ప్రకృతిపార్క్‌లో డీఈఓ ప్రారంభించిన ఈ క్షేత్ర స్థాయి పర్యటన చివరి రోజైన శనివారం కాగజ్‌నగర్ మండలం కోసిని చెక్‌డ్యాం పరిసరాలలో కొనసాగింది. చెక్‌డ్యాం వద్ద బర్డ్ వాచింగ్, కోసిని ఫారెస్ట్ బేసిన్‌ను విద్యార్థులు సందర్శించారు. అనంతరం సిర్పూరు (టి) మండలం వేంపల్లి హరిని హరిత పార్క్‌లో నిర్వహించిన ముగింపు సమావేశంలో జాతీయ హరితదళం రీజనల్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనలు విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు. ప్రకృతి గురించి విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశముంటుందని అన్నారు. అటవీ రేంజ్ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదేనని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ భిక్షపతి, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి చిలుకూరి సత్యనారాయణ, ఎఫ్ఎస్ఓ పోశెట్టి, ఎఫ్‌బీఓ విజయ్, జాతీయ హరితదళం ఉపాధ్యాయులు మామిడాల తిరుపతయ్య, సాబీర్, ప్రవీణ్, దుర్గాప్రసాద్, నటరాజ్, ప్రభోద్, వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలవాసికి వ్యవసాయ రంగంలో జాతీయ అవార్డు



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన నందుర్క సుగుణ అనే రైతుకు వ్యవసాయ రంగంలో సేంద్రియ వ్యవసాయంతో కొత్త ఒరవడులు సృష్టిస్తున్నందుకుగాను జాతీయ అవార్డు లభించింది. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ న్యూఢిల్లీ వారు అవార్డును శనివారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, కైలాస చౌదరి, శోభ కరంద్లాజే, డాక్టర్ హిమాన్షు పాటక్‌ల చేతుల మీదుగా ఆమెకు ప్రధానం చేశారు. వ్యవసాయ రంగంలో జాతీయ ఇన్నోవేటివ్ అవార్డు లభించడం ఆనందకరంగా ఉందని అవార్డు రావడానికి కృషిచేసిన బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వారికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ రంగంలో కొత్త విధానాలతో మరింత ఆదర్శంగా ముందుకు వెళ్తామని సుగుణ తెలిపారు.

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-కోటపల్లి

రాష్ట్ర రాజధానిలోని గాంధీ భవన్‌లో శనివారం కాంగ్రెస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌ను చెన్నూర్, కోటపల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాణిక్ రావ్ టాగూర్‌ను కలిసి పార్టీ వ్యవహారలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుర్మా రాజామల్ల గౌడ్, కోటపెల్లి, చెన్నూర్ అధ్యక్షులు మహేష్ ప్రసాద్ తీవారి, ముత్యాలా బాప గౌడ్, చెన్నూర్ సీనియర్ లీడర్ మరపాక సుకెందర్, మంచిర్యాల జిల్లా డీసీసీ సభ్యుడు స్వరూప్ సింగ్, చెన్నూర్ నియోజకవర్గ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాండ్ర సురేష్, చెన్నూర్ యూత్ అధ్యక్షులు జాడి రాజేందర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-తాండూర్

సమాజ నిర్మాణంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. శనివారం మండలంలోని మాదారం గ్రామపంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు వంటింటికే తరిమితం కాకుండా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సత్యవతి, అనసూయ, మీనా, యదలక్ష్మి, ధనలక్ష్మి, విజయ లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలి



నవతెలంగాణ-నస్పూర్

పదవ తరగతి పరీక్షలకు ప్రణాళికలతో సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ విద్యార్థులకు సూచించారు. శనివారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరీక్షలకు ఒత్తిడికి గురికాకుండా ఉత్తీర్ణులు కావాలని కోరారు.

పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలి



నవతెలంగాణ-జన్నారం

పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని టీఏజీఎస్(తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం) జిల్లా కన్వీనర్ ఎస్.కె అబ్దుల్లా అన్నారు. శనివారం మండలంలోని బాదంపల్లి దోబి గూడెం గ్రామంలో టీఏజీఎస్ ఆధ్వర్యంలో గిరిజన లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ల పై రూ.50 పెంచి పేద ప్రజలను దోపిడీ చేస్తున్నదన్నారు. వెంటనే పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలతో పాటు నిత్యవసర సరుకుల ధరలను తగ్గించి పేద మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. లేనియెడల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గిరిజనులు ఆత్రం భీమ్ పటేల్, ఆత్రం రాము, మేస్రం రాంబాయి, మేస్రం జమున, పేంద్రం చంద్రకళ, మడావి రాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయటం నేరం



నవతెలంగాణ-కోటపల్లి

బాల్య వివాహాలు చేయడం నేరంఅని జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్ గౌడ్ అన్నారు. శనివారం జనగామ గ్రామ పంచాయితీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఏదాగల్సిన వయస్సు కుదుటపడి పోతుందని అన్నారు. అమ్మాయిలు చదువులో రాణిస్తూ ఉన్నత స్థాయిలో ఏదిగినప్పుడే వారి కుటుంబం బాగుపడుతుందని అన్నారు. నేటి సమాజంలో పురుషులకు సమానంగా మహిళలు ఎదుగుతున్నారని అన్నారు. అనంతరం తల్లి దండ్రులకు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాలికలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు.

ప్రత్యేక నిధులతో సీసీ రోడ్లు



నవతెలంగాణ-జైనూర్

మండలకేంద్రంతో పాటు 26 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక నిధులతో సీసీ రోడ్లు వేయించి మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్టు ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పవర్‌హౌజ్ కాలనీలో రూ.5 లక్షలతో నూతనంగా సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం అన్ని రంగాల్లో కృషి చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యవసరమున్న ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి పేద ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. మండలంలో నూతనంగా పలు రోడ్లు మంజూరైనట్టు పేర్కొన్నారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్‌ఖాన్, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నూపటేల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు మెస్రం అంబాజీ పాల్గొన్నారు.

హమ్ ఫౌండేషన్ భారత్ సేవా సంస్థ బాధ్యుల నియామకం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

హమ్ ఫౌండేషన్ భారత్ స్వచ్ఛంద సేవా సంస్థ, కాగజ్‌నగర్ బాధ్యులను శనివారం నియమించారు. ఫౌండేషన్ రాష్ట్ర బాధ్యులు, రిటైర్డ్ ఎస్సై కె.పురుషోత్తంచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ ఆలిండియా డైరెక్టర్ నిశికాంత్ చౌదరి హాజరయ్యారు. కాగజ్‌నగర్ అధ్యక్షులుగా కట్ట సునీల్‌కుమార్, కార్యదర్శిగా కె.నర్సయ్యలను నియమించారు. ఈ సందర్భంగా నిశికాంత్‌చౌదరి మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఫౌండేషన్‌ను నిర్వహిస్తున్నామని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడే పేదలను ఆదుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిశికాంత్‌చౌదరిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.జయదేవ్, సభ్యులు నర్సయ్య, మురళీధర్‌రావు, మార్త సత్యనారాయణ, ఎఎస్ఆర్ మూర్తి, షేక్ మహబూబ్, యు నారాయణ, అన్వరొద్దీన్, ఎక్బాల్ అహ్మద్, సీహెచ్ రామయ్య, ఆర్ నారాయణ, మల్లయ్య పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్



గర్భిణులు, పిల్లతల్లులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్ సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ముదిగుంట గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన మహిళల హక్కులను సధ్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సంధర్భంగా మహిళలు ఎంపీపీ గోదారి రమాదేవిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, గ్రామ పంచాయతి సర్పంచ్ దూట జ్యోతి, తాల్లపల్లి రాజేశ్వరి, ఏఎన్ఎం నిరోశ పాల్గొన్నారు.

రైతుల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-బోథ్

రైతుల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో శనగ పంట కొనుగోలు కేంద్రాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ప్రతి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తూ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి గింజను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే రైతులకు రైతుబీమా, రైతుబంధు ఉచిత విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తూ, రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ముందుకెళ్లడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్‌మాన్ సింగ్, వైస్ చైర్మెన్ సంజీవరెడ్డి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు లింభాజీ, తాహీర్, ఎలక రాజు, రమణ గౌడ్, మెడి చెల్మ ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

సహకార సంఘం ఏర్పాటు చేయండి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేచిని గ్రామ పంచాయతీలో బెస్త కులస్తులకు నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు కోసం గ్రామ పంచాయతీ తీర్మానం చేయాలని కోరుతూ గ్రామపంచాయతీ ముందు బైఠాయించారు. రేచిని సర్పంచ్‌కు వినతిపత్రం ఇవ్వడానికి శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఫోన్ ద్వారా సర్పంచ్‌కు సమాచారం ఇవ్వగా, వినతిపత్రం తీసుకోవడానికి సర్పంచ్ నిరాకరించారు. ఆగ్రహించిన బెస్త కులస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించారు. తీసుకొనే దాకా ఇక్కడి నుంచి వెళ్ళేది లేదని 3 గంటలు పంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించడంతో దిగొచ్చిన గ్రామ సర్పంచ్, బెస్త కులస్తుల నుంచి వినతిపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో రేచిని మత్స్యకార సంఘం అధ్యక్షుడు బామనిపెల్లి ఆనంద్, గిరుగుల రమేష్, పోషయ్య, బాలక్క, గంగక్క, పోచక్క, రవి, రాజన్న, రాజ్ కుమార్, అంజన్న, గొలేటి, మల్లేష్ పాల్గొన్నారు.

10 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని ఎస్‌కెఈ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్న సైన్స్ విద్యార్థులకు ఈ నెల పదో తేదీ నుండి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్స్)లో ఈ పరీక్షలు నిర్వహిస్తారని, పూర్తి వివరాలకు 9866398678 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం నాలుగో రోజున స్థానిక విద్యనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ)లో కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలకు డిజిట్ ఆల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ అంశంపై వివరించారు. సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య, లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర సఖి కేంద్రంలో అందించే ఐదు రకాల ఉచిత సేవలైన కౌన్సిలింగ్, న్యాయ, పోలీస్, వైద్య, సపోర్ట్ అంశాలపై అవగాహన కల్పించారు. తాత్కాలిక వసతి, బాలల, మహిళా చట్టాలు, లింగ సమానత్వం గురించి వివరించారు. వాటి హెల్ప్ లైన్ నెంబర్లు 181, 1098, 100, 14567 అని సూచించారు. ఈ కార్యక్రమంలో కుట్టు మిషన్ శిక్షకురాలు మేరీ, సఖి అడిషనల్ డైరెక్టర్ రఘునాథ్, శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

జేబు దొంగను పట్టుకున్న ఆర్టీసీ కంట్రోలర్

నవతెలంగాణ-నిర్మల్



జేబు దొంగను ఆర్టీసీ కంట్రోలర్ శనివారం పట్టుకున్నారు. కంట్రోలర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ బస్టాండ్‌లోని బోథ్ స్టాప్ వద్ద బస్సులో ఎక్కుతున్న ఓ ప్రయాణికుడి జేబును ఓ జేబు దొంగ కాజేయడానికి ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన ఆన్ డ్యూటీ కంట్రోలర్ మహేందర్‌రెడ్డి వెంటనే జేబు దొంగను పట్టుకున్నాడు. కాగా సదరు దొంగ తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేశాడు. తిరిగి మహేందర్‌రెడ్డి వెంబడించి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పజెప్పారు. జేబు దొంగను పట్టుకున్న మహేందర్‌రెడ్డిని ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు ఈ సందర్భంగా అభినందించారు.

ఉపాధిహామి పనులను పరిశీలించిన డీఆర్డీఓ కిషన్



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని వాన్వాట్, అంకాపూర్ గ్రామాల్లో శనివారం మాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద కొనసాగుతున్న పనులను డీఆర్డీఓ కిషన్ పరిశీలించారు. కూలీలు పనిచేస్తున్న తీరు, పని కొలతలు నిర్వహించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏపీఓ గంగాధర్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంకాపూర్, వాన్వాట్ సర్పంచ్‌లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన ఉండాలి

- సిర్పూర్(టి) మున్సిబ్ కోర్టు జెడ్జి రవి



కౌటాలలో...

నవతెలంగాణ-కౌటాల

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిర్పూర్ మున్సిబ్ కోర్టు జెడ్జీ రవి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాల గురించి తెలుసుకొని ఉండాలన్నారు. చట్టాల గురించి తెలిస్తేనే నేరాలను అధిగమించే అవకాశముందన్నారు. ర్యాగింగ్ చేసే విద్యార్థులను శాశ్వతంగా పాఠశాల, కళాశాలల నుండి తొలగించి అక్కడితో చదువు ఆపివేసేలా చట్టాలున్నాయన్నారు. ఈ విషయం తెలుసుకోకుండా విద్యార్థులు వంద ఏండ్ల భవిష్యత్తును 20 ఏండ్లలోపే బలవుతున్నారన్నారు. చిన్నపిల్లలు, మైనర్ బాలికలను శారీరకంగా, మానసికంగా వేధిస్తే నింధితుడి మీద కేసు రుజువైనప్పుడు మరణశిక్ష వేసే అవకాశముందని హెచ్చరించారు. నేడు చిన్న సంఘటన జరిగితే జిల్లా పేజీలో వార్త వస్తుందని, అదే మరో రోజు తీవ్రస్థాయిలో సంఘటన జరిగితే మెయిన్ పేజీలో వస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పదో తరగతితోనే చదువులకు పులిస్టాప్ పెట్టి పెళ్లిళ్ల చేసే విధానాన్ని ఆపివేయాలన్నారు. నేటి సమాజంలో పదో తరగతి పెద్ద చదువు కాదన్న విషయం తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. బాలికలు, యువత తమ విజ్ఞానాన్ని నిరూపించి ప్రయోజకులయ్యేదాక చదువు ఆపొద్దని సూచించారు. నేటి సమాజంలో ఏ వ్యక్తి చేతిలోనైనా రెండు సెల్‌ఫోన్‌లు సాదారణ మయ్యాయని, వీటి మూలంగా చిన్నపిల్లలు, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ సాదిక్‌పాషా, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, సెక్రటరీ గణపతి, న్యాయవాదులు కళ్యాణ్, అజయ్, కస్తూర్బా ఎస్ఓ పవిత్ర పాల్గొన్నారు.



నిర్మల్‌లో...

నిర్మల్ : ప్రజలు చట్టాలపై అవగాహనను కలిగి ఉండాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ కె.అజేశ్ కుమార్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ గురుకుల బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాల విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యం నుంచి విద్యార్థినులు అన్ని చట్టాలపై అవగాహనను కలిగి ఉండాలని అన్నారు. న్యాయ విజ్ఞానాన్ని తెలుసుకోవాలని అన్నారు. అనంతరం న్యాయవాదులు రాజలింగం, మధుకర్, అశోక్, మహేందర్, వంశీలు విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీరడి గంగాశంకర్, ప్రముఖ వ్యాఖ్యాత బి.వెంకట్, కోర్ట్ సూపరింటెండెంట్ శైలజ, ఉపాధ్యాయులు వీణారాణి, జ్యోతి, సంతోష్, కుమ్మరి ఓదేలు, జ్యోతి, మాధవి, స్వర్ణలత, దీపక్ చరిష్మా విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని రెబ్బెనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు, అదనపు కలెక్టర్ గౌతమి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించడం



అభినందనీయమని అన్నారు. పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బాల్య దశలోనే విద్య చాలా ముఖ్యమని అన్నారు. పాఠశాలల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నామని వారు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు పొందాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ వేషధారలతో సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు గురవయ్య వైస్ ఎంపీపీ అనిల్, మాజీ ఎంపీపీ మల్లేష్, ఎంఈఓ రవీందర్, ఎంఎన్ఓ పార్వతి సత్యనారాయణ, సర్పంచులు కళ్యాణి రజిని పుష్పలత, ఎంపీటీసీ మౌనిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్చన, ఎస్ఎంసీ చైర్మన్ వినోద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జోగు రామన్న కృషితోనే గ్రామాలకు రహదారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎమ్మెల్యే జోగు రామన్న కృషితోనే మారుమూల గ్రామాలకు రహదారులు మంజూరు అయి పనులు కొనసాగుతున్నాయని ఆదిలాబాద్ ఎంపీపీ గండ్రత్ రమేష్ అన్నారు. శనివారం కల్వర్టు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. రహదారి పనులను ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంబిస్తే, బీజేపీ నాయకురాలు తమ వల్లనే పనులు ప్రారంభమయ్యాని గొప్పటు చెప్పుకోవడం హాస్యస్పదమని అన్నారు. ఆదివాసీ గ్రామాలకు రహదారి పనులు ప్రారంబిస్తే, బీజేపీ నాయకురాలు వెళ్లి సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. 2016-17 సంవత్సరంలోనే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, ఆ సమయంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ఆలస్యం చేయడంతో తిరిగి టెండర్ వేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తాజాగా టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత వివిధ సర్వేల కారణంగా పనులు ప్రారంభం కాలేదని, ఈ అడ్డంకులను అధిగమించి, రహదారి పనులు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కృషి చేశారని వివరించారు. బీజేపీ నాయకురాలు తన పోరాటం ఫలితంగానే రహదారి పనులు ప్రారంభమయ్యాయని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. బీజేపీలో ఉన్న అంతర్గత విభేదాలతో ఆ పార్టీ నాయకులు ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ నాయకురాలు జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో కనీసం ఈ గ్రామాల పేర్లు అయిన తెలుసా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కిషన్, చందు, గంగారాం, పరశురాం, రాజు, జగదీష్, రమణ, మోతీరాం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్ ప్రభుత్వ పాఠశాలను శనివారం అదనపు కలెక్టర్ రాంబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థుల శాతం తక్కువగా ఉండటాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నవనీత్ కుమార్, ఏపీఓ సుగుణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ గోదావరి, ఫీల్డ్ అఫీసర్ మహమ్మద్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-సారంగాపూర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ విజయలక్ష్మీ అన్నారు. శనివారం మండలంలోని జామ్ గ్రామంలో కస్తూర్బా పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిక మహిళా హక్కులు, చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడెల్లి పోచమ్మ కమిటీ చైర్మెన్ అయిటి చందు, ఉప సర్పంచ్ విలాస్, సీడీపీఓ ఏ.నాగమణి, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయగౌరీ, ఐసీపీఎస్ రాజు, సఖి కోఆర్డినేటర్ మమత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో చిత్రకళా ప్రదర్శన పోటీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం చిత్రకళా ప్రదర్శన పోటీలు నిర్వహించారు. మహిళా సాధికారతా విభాగం ఆధ్వర్యంలో 'ఆధునిక సమాజంలో స్త్రీ' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. న్యాయనిర్ణేతలుగా సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ రాజు, ఎం రాజేశ్వర్, డి జనార్ధన్‌లు, కార్యక్రమ నిర్వాహకులుగా ఇ శారద, బి రోజ్‌మేరి వ్యవహరించారు. గెలుపొందిన విద్యార్థినులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందించనున్నట్లు ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని కంచరోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. సీఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు వ్యక్తికి సుమారు (40) సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. మృతదేహంపై బ్ల్యూ కలర్ జీన్స్ ప్యాంటు, కట్ బనియన్ ధరించి ఉన్నాడు. మెడలో ఒక రోల్డ్ గోల్డ్ చైన్ ఉన్నదని తెలిపారు. గత రెండు రోజులపైగా చెరువులో ఉండటంతో మృతదేహం పూర్తిగా గుర్తు పట్టరాని విధంగా మారిందని, జిల్లాలోని పరిసర ప్రాంతాలలో, ఎవరైనా వ్యక్తులు తప్పిపోయినచో ఎస్సై రమణారెడ్డి ఫోన్ నెంబర్ 7013857446కు, నిర్మల్‌టౌన్ సీఐ ఫోన్ నెంబర్ 8712659511 కు సంప్రదించాలని కోరారు.

ఎంపీపీ భర్తను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బాసర

మండల ఎంపీపీ సునీత భర్త విశ్వనాథ్ పటేల్‌ను బీదరెల్లిలోని ఆయన నివాసంలో శనివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. రెండు రోజుల కింద కుక్కల దాడిలో ఎంపీపీ భర్త విశ్వనాథ పటేల్ గాయాల పాలయ్యాడు. ఎంపీపీ భర్త విశ్వనాథ్ పటేల్‌ను ఆరోగ్యం గురించి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్ రావు, మల్కాన్న యాదవ్, మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మండలాభివృద్ధికి ప్రజా ప్రతినిదులందరూ కృషి చేయాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సబ్‌కే యోజన సబ్‌కె వికాస్‌లో భాగంగా మండల ప్రజా పరిషత్ కోరం సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో అభివృద్ది పనులలో భాగంగా చేపడుతున్న పనులు ఎప్పకప్పుడు పూర్తి చేయాలని అన్నారు. అభివృద్ధి పనులకై ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేల చూడాలని కోరారు. ఈ సమీక్షలో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, ఎంపీడీఓ తిరుమల, కోఆప్షన్ సభ్యులు రషీద్, ఎంపీటీసీలు గోపాల్ రావు, ఆత్రం లచ్చు పటేల్, అర్క రాణి, రవీందర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మండలంలో శిక్షణ కలెక్టర్‌లు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

జాతీయ స్థాయిలో అత్యున్నత శిక్షణ అయిన సివిల్స్ సర్వీస్ శిక్షణలో భాగంగా ఐదుగురు శిక్షణ కలెక్టర్‌లు మండలంలో పార్పెల్లి గ్రామాన్ని శనివారం సందర్శించారు. శిక్షణలో భాగంగా భిన్న బాషా, సంస్కృతి, అలవాట్లు, ఆచారాలు, ప్రజలు అనుసరిస్తున్న పద్ధతులు, స్థితి గతులు, వ్యవసాయ రంగంలో అవలంబిస్తున్న సాంకేతికతను, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, క్షేత్ర స్థాయిలో అమలు తీరు, గురించి తెలుసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, సర్పంచ్ రాజేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవతెలంగాణ-గుడిహత్నూర్

మండలంలోని సీతాగొంది గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సితాగొంది గ్రామానికి చెందిన అర్క రాములు శుక్రవారం రాత్రి జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా ఆదిలాబాద్ వైపు నుండి గుడిహత్నూర్ వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీ కొట్టింది. దీంతో అర్క రాములుకి తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం 108లో రిమ్స్ తరలించారు. చికిత్స పొందుతూ రాములు మృతి చెందాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.